క్లుప్తంగా

హోరోబు ప్రార్థన మందిరంలో ముగిసిన వేడుకలు



తెనాలి టౌన్: చెంచుపేట ఇందిరాకాలనీలోని హోరోబు ప్రార్థనా మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరో వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. సంఘ కాపరి బ్రదర్ భక్తసింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రత్యేక వర్తమానికులు బ్రదర్ ఇమ్మానియేలు జమరాజ్ (విజయవాడ) బ్రదర్ ఫిలిప్‌లు (జమ్ములమడుగు) వాక్య సందేశం అందజేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న వారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వధార్ హోంలో అన్నదానం



తెనాలి: దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన వీరంకి వెంకట పద్మావతి 19వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమె కుమార్తెలు వీరంకి రమ్య–శ్రీకాంత్ దంపతులు, వీరంకి కావ్య స్థానిక జేఎంజే స్వధార్ హోంలోని ఆశ్రితులకు అన్నదానం చేశారు. పట్టణ గాంధీచౌక్‌లోని కొల్లావారి వీధిలో గల శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. రెండుచోట్ల స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట పద్మావతి భర్త, సీనియర్ ఫొటోగ్రాఫర్ వీరంకి రాజశేఖర్, ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఘంటసాల



తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత విభావరిని నిర్వహించారు. ప్రారంభ సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతి అధ్యక్షత వహించారు. సినిమా సంగీతానికి ఒక గౌరవాన్ని, స్థాయిని కల్పించిన గాన గంధర్వుడు ఘంటసాల అని చెప్పారు. ఆచార్య మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ ఘంటసాల ఎంత గొప్ప గాయకుడో, అంత గొప్ప వ్యక్తిత్వం కలిగినవారని చెప్పారు. కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు వాకా పేరిరెడ్డి తమ ప్రసంగాల్లో ఘంటసాల గాన సౌందర్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పీజే ప్రసూనాంబ, వీవీఎస్ సంతోష్‌కుమార్, వీవీఎన్ సందీప్‌కుమార్, వాకా కరుణ, సునీత పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుని ఆలయ వార్షికోత్సవం



రేపల్లె: పట్టణంలోని 8వ వార్డులోని శ్రీ షిర్డీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే బాబాకు సుప్రభాత సేవ, అభిషేక మహోత్సవాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

ముక్తేశ్వరునికి ఎంపీ మోపిదేవి ప్రత్యేక పూజలు



రేపల్లె రూరల్: మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేసి జగనన్న ఆశయాన్ని సాధిద్దాం

అవగాహన సదస్సులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్. పక్కన సమన్వయకర్త రవీంద్రరెడ్డి, ప్రజాప్రతినిధులు

తెనాలి: జనరంజక జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన మరో మూడు దశాబ్దాల పాటు నిలబెట్టేందుకు అంతా సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించినట్టు 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో పార్టీ గెలుపును సాధిద్దామని చెప్పారు. అన్నివర్గాల్లోని పేదలు, మధ్యతరగతి ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంతోషంగా ఉంటున్నారనీ, కులమతాలు, పార్టీలకు అతీతంగా అవినీతి ప్రస్తకే లేకుండా సంక్షేమ ఫలాల్ని అందుకుంటున్నారని గుర్తు చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే మళ్లీ మళ్లీ సంక్షేమరాజ్య పరిపాలన రావాలని తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం సాయంత్రం తెనాలి పట్టణ, మండల పరిధిలోని వార్డు, గ్రామ వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సును నిర్వహించారు. 'జగనన్నే మా భవిష్యత్' పేరుతో చేపట్టనున్న ఇంటింటి ప్రచారంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 86.5 శాతం మంది ప్రజలకు సంక్షేమ లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. పార్టీలు, కులాలతో పనిలేకుండా పేదరికమే అర్హతగా సంక్షేమాన్ని కల్పించిన ఘనత దేశంలో జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ కృషి గొప్పదని కొనియాడారు. మళ్లీ ఇప్పుడు గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల్ని వివరించాలని, ఏదైనా లోపంతో అందకపోతే పరిష్కరించేలా చూడాలని కోరారు. రాష్ట్ర సమన్వయకర్త కందుల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ గృహ సారథులు పార్టీకి, ప్రజలకు మధ్య వారధులుగా స్పష్టం చేశారు. మార్చి 18 నుంచి ఎనిమిది రోజుల పాటు తమ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి జగనన్న సందేశాన్ని తెలియపరచాలని కోరారు. సంబంధిత వీడియోల్ని ప్రదర్శించి చూపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ప్రోగ్రాం పట్టణ ఇన్‌ఛార్జులు మన్నవ ప్రభాకర్, తాడిబోయిన రామయ్య, రూరల్ మండల ఇన్‌ఛార్జి ఎండీ ఫరీద్ మాట్లాడారు. కౌన్సిలరు కొత్రా యశోద స్వాగతం పలికిన సదస్సులో జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, వైఎస్ ఎంపీపీలు కోడూరి స్వప్న, గోపిశెట్టి రమాదేవి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కావేటి నిర్మల, రాళ్లబండి సుష్మ, సత్యజ్ఞాన ప్రసూనాంబ, యార్డు వైస్ చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, మేదర సంఘ నేత మేడా రామారావు, వైఎస్సార్ సీపీ నేతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, బూరెల దుర్గాప్రసాద్, తాడిబోయిన రమేష్, దేసు శ్రీనివాసరావు, కాకి దేవసహాయం, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ దుబాయ్‌బాబు, కోలా వాసు, కఠెవరపు రాజమోహన్, కొడాలి శ్రీకాంత్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వోల జ్యోతి పూజ



పాత శివాలయంలో అర్ధరాత్రి జ్యోతి వెలిగిస్తున్న అర్చకులు

తెనాలి టౌన్: మహా శివరాత్రి పర్వదినం రోజున శనివారం అర్ధరాత్రి గంగానమ్మపేటలోని పాత శివాలయంలో జ్వోల జ్యోతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హర హర మహాదేశ శంభోశంకర అంటూ భక్తులు నినాదాలు చేశారు. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. అర్చకుడు పసి జ్యోతిని వెలిగించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెసర్లంక రమణ, కల్పన దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుర్రా శ్రీను, షేక్ మీరావలి, తట్టుకుళ్ళ ఆశోక్‌యాదవ్, దోనేపూడి రాఘవేంద్రరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రమణకుమారి, భక్తులు పాల్గొన్నారు.

● శివాలయంలో ఆదివారం జరిగిన శివ కల్యాణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ రియాజుద్దీన్, బూరెల దుర్గాప్రసాద్, పెసర్లంక రమణ, ఈవో రమణకుమారి పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

● రథోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు జరిపి ప్రారంభించారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంపై ఎమ్మెల్యే శివకుమార్ ఆశీనులు కాగా, పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రాయపాలెం శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చక్రాయపాలెం(కొల్లిపర): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా చక్రాయపాలెంలోని శ్రీ గంగపార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెనాలి శాసన సభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పూజల్లో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి



యడ్లపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉంటూ పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి వెంకట్రావు అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు యడ్లపాటి వెంకట్రావు ప్రథమ వర్ధంతిని గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించారు. పలువురు యడ్లపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యడ్లపాటి జీవితం యువ రాజకీయ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా యడ్లపాటి చేసిన అభివృద్ధి మరువరానిదని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, బాపట్ల అర్బన్ డెవలెప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోనినేని ఉమ, పలువురు టీడీపీ, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు ఉన్నారు.

రంగస్థల కళాకారుడు రవివర్మకు సన్మానం



రవివర్మ తదితరులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో ఆదివారం సాయంత్రం చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ సమ సమాజ దృష్టి అనే అంశంపై వెంపటి సత్యనారాయణ, కొల్లూరు బసవయ్య ప్రసంగించారు. అనంతరం వక్తలతో పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల రవివర్మను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ఉమ్మలనేని ధర్మారావు, దేవిశెట్టి భాస్కర్, బడుగు మోహనరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, హృదయరాజు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొరస్వామికి నేతల నివాళి



దొరస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి, మంత్రి అంబటి

రేపల్లె: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గరికపాటి వెంకట నారాయణ దొరస్వామి సంస్మరణను పట్టణంలోని 12వ వార్డు యలవర్తి వారి వీధిలోని ఆయన స్వగృహంలో ఆదివారం నిర్వహించారు. జెడ్పీటీసీగా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా, బార్ అసోసియేషన్ సభ్యునిగా ఆయన సేవల్ని పలువురు గుర్తు చేసుకొన్నారు. దొరస్వామి చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, కమతం సాంబశివరావు, రసాలయ కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ తదితరులు నివాళులర్పించారు.

వైభవంగా అగస్తేశ్వరస్వామి కల్యాణం



వెల్లటూరులో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత అగస్తేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు బి.సుందరశర్మ, కె.రాజేష్ పూజల్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం బలిహరణ, రథోత్సవం నిర్వహించారు. సోమవారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేవతల గుడిగా ప్రసిద్ధిగాంచిన భట్టిప్రోలులోని గంగా పార్వతీ సమేత విశలేశ్వరస్వామి దేవాలయంలో స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పలువురు దంపతులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో బీజేపీ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని

తెనాలి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల్ని భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానం, బ్యాంకింగ్ వంటి రంగాలను కూడా ప్రైవేటు పరం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం ముందడుగు వేస్తుందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితువు పలికారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ తెనాలి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.కొండబాబు, పల్నాటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, కె.గోపి, సహాయ కార్యదర్శిగా పి.భానుచందర్, కోశాధికారిగా పి.ఆశోక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, సీపీఐ ఏరియా కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, హరికృష్ణ, తదితరులు

తెనాలి అర్బన్: మొగల్ పాలకులపై వీరోచితంగా పోరాడి భారతదేశాన్ని రక్షించిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని కడియాల సునీల్‌కుమార్ కొనియాడారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని శివశక్తి, బీజేపీ యువ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మైలా హరికృష్ణ, కె.వి.సుబ్బారావు, చేతుల వెంకట్రావు, కడలి కుమార్, దాసరి వెంకటనాగరాజు, నందికంటి రామాంజనేయులు, మాతూరి లక్ష్మీనారాయణ, తరుణ్ గోపి, జగదీష్, కుర్రా శివ, ధూళ్ల భరత్, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివరామిరెడ్డి

తెనాలి టౌన్: రూరల్ మండలం కంచర్లపాలెంలో తెనాలికి చెందిన భీష్మ ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ ప్రారంభించారు. శిబిరంలో వైద్యశాల డాక్టర్ కె.శివరామిరెడ్డి సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణిమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్ బాబు, వైద్యశాల నిర్వాహకులు బండ్లమూడి రాజేష్, జ్యోతి, మల్లీశ్వరి, సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, కఠెవరపు శివయ్య, రాజేష్, ప్రకాష్, జయశేఖర్, నరసింహారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న దుర్గాప్రసాద్

తెనాలి టౌన్: ఏటా శివరాత్రి పురస్కరించుకుని పేద వృద్ధులకు దుస్తులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమని రేమిణిశెట్టి దుర్గాప్రసాద్(అమెరికా) పేర్కొన్నారు. రూరల్ మండలం ఖాజీపేటలోని శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కమిటీ చైర్మన్ రాచర్ల సాంబయ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల్ని నిర్వహించారు. తొలుతగా దేవస్థానంలో దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు, ఎస్.వి.ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకులు శనగపల్లి వెంకటేశ్వరరావు (హైదరాబాద్), సాంబయ్య కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అర్చకులు కొండ కావూరి నాగలింగశర్మ పూజలు జరిపారు. అనంతరం దేవస్థానం ఆవరణలో కమిటీ చైర్మన్ రాచర్ల సాంబయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేద వృద్ధులు 49 మందికి, మహిళలు, 15మంది పురుషులకు నూతన దుస్తుల్ని దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల్ని పంపిణీ చేశారు. అనంతరం దుర్గాప్రసాద్ భక్తులకు అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాతూరి నాగేశ్వరరావు, రెడ్డి శివరామకృష్ణ, అంకిరెడ్డి సీతారామయ్య, పోతాబత్తుని మోహనరావు, రాచర్ల సత్యనారాయణ, జానార్దనరావు, పాండురంగరావు, పసుపులేటి వెంకట్రావు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవమూర్తుల్ని గ్రామంలో ఊరేగించారు.

సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

తెనాలి టౌన్: సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనలో భాగంగా శ్రీలక్ష్మీ శారదా సంగీత ఆలయం విద్యార్థులు బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పంచరత్న, ఉపచార కీర్తనలు ఆలపించారు. తొలుతగా సంగీత గురువులు గౌరావఝల ఆంజనేయశాస్త్రి ఇంటి నుంచి నగర సంకీర్తనలు ఆలపిస్తూ వాసవీ ఆలయానికి చేరుకున్నారు. త్యాగరాజ స్వామి విరచిత ఘన రాగాల్ని విద్యార్థులు ఆలపించారు. గత 35 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు. తీర్థప్రసాదాలు వితరణ చేశారు. మృదంగంపై వెంకట రామకృష్ణ, వైలెన్‌పై శ్రీకృష్ణ అభిరామ్, ఆంజనేయశాస్త్రి సహకరించగా, కొండపి శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్తీక్, సౌజన్య, కుమార శ్యామ్‌కృష్ణ శర్మ, అరుణ, వల్లి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

తెనాలి టౌన్: చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి ఆదివారం తెలిపారు. సమావేశంలో డివిజన్‌లోని వినియోగదారులు పాల్గొని సమస్యల్ని తెలియజేసి పరిష్కారానికి సహకరించాలని ఆయన కోరారు.

ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: కొల్లావారి వీధిలోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో ఆదివారం వీరంకి వెంకట పద్మావతి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, రమ్య, శ్రీకాంత్, కావ్య పాల్గొన్నారు.

ఫ్యాన్సీ షాపులో చోరీ

తెనాలి రూరల్: పట్టణంలోని ఫ్యాన్సీ షాపులో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ బోసు రోడ్డులోని కార్తికేయ ఫ్యాన్సీ షాపులో ఈ నెల 17న చోరీ జరిగింది. మూసి ఉన్న దుకాణంలో రూ.14 వేలను దుండగులు అపహరించారు. ఈ మేరకు దుకాణ నిర్వాహకులు ఆదివారం వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించగా, కేసు నమోదు చేశారు.

పెరిగిన బాలకోటేశ్వరుని తిరునాళ్ల రాబడి

రేపల్లె రూరల్: అరవపల్లి బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల రాబడి గతేడాది కంటే పెరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.రాజేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణంలో ఆదివారం కానుకల లెక్కింపు నిర్వహించారు. వివరాలను ఈఓ వెల్లడించారు. గతేడాది రూ.10,00,681 రాగా ఈ ఏడాది రూ.10,23,927 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రూ.23,246 పెరిగిందన్నారు. హుండీలోని కానుకల ద్వారా రూ.4,97,217 , దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,47,730, కేశ ఖండన ద్వారా రూ.580, అభిషేకాలకు రూ.1,47,000, ప్రసాదాల విక్రయాలతో రూ.1,89,200, కొబ్బరి చిప్పలు అమ్మకంలో రూ.35,000, నెయ్యి అమ్మకంతో రూ.7,200 సమకూరిందని తెలిపారు.

మంత్రి వెళ్లిన వీధులకు సీసీ రోడ్లొచ్చాయి..

ఐలవరం(భట్టిప్రోలు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఈ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఉపకరిస్తోంది. మండలంలోని ఐలవరం–2 సచివాలయం పరిధిలో పర్యటించిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు గ్రామస్తులు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, బాగు చేయాలని కోరారు. ఆయన ఆదేశాలతో అధికారులు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. సుమారు 400 మీటర్ల మేర గ్రామంలోని ఆరు ఏరియాలలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా జరిగేలా కృషి చేశారు. త్వరలో మంత్రి నాగార్జునతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శివయ్యకు బ్రహ్మ'రథం'



గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి స్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామి దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షించి పులకించారు. ఆదివారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి దివ్య రథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు భారీగా తరలిరావడంతో నగర వీధులు కిటకిటలాడాయి. ఓం నమశ్శివాయః నినాదంతో మార్మోగాయి. రథోత్సవం శివాలయం వద్ద బయలుదేరి మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు అందుకుని సీతారామ కోవెల వరకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులు స్వామికి టెంకాయలు కొట్టి హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.